**కథ**

# నిర్ణయం

**- ఎం. కనకదుర్గ**

వెన్నెల బాల్కనీలోకి పరుచుకున్నట్లుగా పడుతోంది. అరవిచ్చుకున్న మల్లెలు, పారిజాతాల సువాసన కలగలిపి మృదువుగా అలుముకుంటోంది.

"అమ్మా! ఇంకా నిద్రపోలేదా?"

వాలుకుర్చీలో చేరగిలబడి ఆకాశంలోకి చూస్తూ ఏదో దీర్ఘంగా ఆఆలోచిస్తున్న వసుంధర తలతిప్పి చూసింది. ఎప్పుడూ పదిన్నరకంతా - నిద్రపోయే తల్లి ఆ రాత్రి ఇంకా మేలుకొని, ఏదో ఆలోచిస్తూ ఉంటే ఆశ్చర్యమే మరి!

"నిద్ర పట్టడం లేదా అమ్మా" - మళ్ళీ అడిగింది రేఖ. "లేద"న్నట్లు తల ఊపింది వసుంధర.

"రేపటి ప్రోగ్రాం గురించేనా నీ ఆలోచన? ఏంటమ్మా.. జస్ట్ క్యాజువల్. వాళ్ళు వస్తారు. వెడతారు. మనింటికి ఎంతమంది గెస్టులు రావడంలేదు! దానికి ఇంత టెన్షన్ ఎందుకు? కుదిరితే కుదురుతుంది. లేక పోతే లేదు. అంతే" అంది రేఖ.

"అయితే ఆ అబ్బాయినినువ్వు ప్రేమించలేదా?" నెమ్మదిగా సూటిగా అడిగింది వసుంధర.

"పిచ్చి మమ్మీ! మీ కాలం అనుకుంటున్నావా! దేవదాను, పార్వతి వెన్నెల్లో ప్రేమించెయ్యడానికి, శేఖర్, అయినా, వాళ్ళ తల్లిదండ్రులైనా ఈ పెద్ద ప్రపంచంలో ఓ చిన్న భాగం మాత్రమే. వాళ్ళ నిర్ణయం మీద నా జీవితమేమీ ఆధారపడి లేదు. అయినా ఆవిడ ఏం అడుగుతుందో అడగనీ. అప్పుడు చూద్దాం" బాబ్డ్‌హెయిర్‌ని బ్రష్ చేసుకుంటూ అన్నది రేఖ. అర్థం కానట్టు చూసింది వసుంధర.

"ఈ విషయంలో ఫెయిల్ అయితే నువ్వేమీ బాధపడవా?"

"ఎందుకు ఏడవను? ఇంటర్వ్యూలో డిస్క్వాలిఫై అయితే కొన్నాళ్ళు బాధపడతాం... తర్వాత మన కెరీర్... మనం... రోటీన్" అంది రేఖ.

"రేపటిరోజున నీ జీవితం విషయంలో నేనొక కొత్త నిర్ణయం తీసుకోబోతున్నాను. దానివల్ల బహుశః ఈ సంబంధం తప్పిపోయినా తప్పిపోవచ్చు. ఒకవేళ తప్పిపోయినా దానికి నువ్వు బాధపడకుండా ఉంటే నేను మరీ సంతోషిస్తాను."

రేఖ చటుక్కున మోకాళ్ళ మీద కూర్చుని తల్లి ఒడిలో తల పెట్టుకొని రెండుచేతులూ తల్లి నడుంచుట్టూ వేసింది.

"అమ్మా ఇన్ని సంవత్సరాలుగా నువ్వు ఏం చేసినా మా మంచికోరే చేశావు. ఇక ముందు కూడా నువ్వు ఏ నిర్ణయం తీసుకున్నా మా మంచికేనని నాకు నమ్మకం ఉంది. 'ఇదేమిటి?' అని నిన్ను ప్రశ్నించబోయేముందు నేను ఎంతో ఆలోచించుకోవలసి ఉంటుందమ్మా..."

వసుంధర తృప్తిగా కూతురిని దగ్గరికి తీసుకొంది.

కొన్ని క్షణాలు... ఇద్దరూ అలాగే ఉండిపోయారు. ఒకరి భావాలు ఇంకొకరిలోకి ప్రవహిస్తున్న అనుభూతి... ఇద్దరిలోనూ.

కాసేపటి తర్వాత రేఖ కాస్త తటపటాయిస్తూ

"అమ్మా! అడుగుతున్నందుకు ఏమీ అనుకోకు. మాకు ఊహ తెలిసిన దగ్గరినుంచీ నువ్వు కష్టపడి మమ్మల్ని పెంచుతున్నావు. నువ్వు సంపాదించిన ప్రతి పైసా, నీ ఒంట్లోని సర్వశక్తులూ, మా కోసమే ఉపయోగించావు. మనం చాలాసార్లు ఫ్రెండ్లీగా ఎన్నో విషయాల గురించి డిస్కస్ చేసుకున్నాం... నిర్ణయాలు తీసుకున్నాం. కానీ ఈ విషయంలో నువ్వొక్కదానివే నిర్ణయం తీసుకున్నానంటున్నావు. సరే, కాదనను, కానీ, మా మేరీడ్ లైఫ్ఎలా ఉండాలని నీ అభిప్రాయం? జస్ట్ అడిగానంతే. ఏమీ అనుకోవద్దు.. ఇష్టం వుంటే చెప్పు. లేకుంటే లెట్స్ లీవ్ ది టాపిక్.."

ఎం.ఫిల్ పాసయిన కూతురు, చక్కని తెలివితేటలున్న అమ్మాయని పేరు తెచ్చుకున్న కూతురు.. అడిగిన తీరు చూసి ముచ్చటగా అనిపించింది వసుంధరకు.

"రేపు వాళ్ళముందు నా నిర్ణయం వెల్లడించేముందు నీకు నా జీవితంలోని చాలా విషయాలు చెప్పాలి. నేను ఎదుర్కొన్న చేదు అనుభవాలను నీతో పంచుకోవాలి. అవన్నీ విన్నాక నువ్వు జాగ్రత్తగా ఆలోచించి రేపు నేను చెప్పబోయే నిర్ణయం మంచిదో కాదో తేల్చుకోవలసి వుంది. ఈ దేశంలోని గొర్రెలమందలాంటి ఆడవాళ్ళలో నువ్వూ ఒకదానివి అయి కష్టాలు పడకూడదు. అలా నువ్వు కాకూడదనే నిన్ను విలక్షణంగా పెంచాను..."

మొదలుపెట్టింది వసుంధర

* * *

"మాది పెద్దలు కుదిర్చిన పెళ్ళే. శ్రీధర్ చేయి పట్టుకుని అత్తవారింట్లో అడుగుపెట్టిన నాకు, విభిన్న మనత్తత్వాలు గల మనుషులతో సర్దుకుపోయి బ్రతకవలసిన అవసరం ఏర్పడింది. 'ఇది నా ఇల్లు, వీళ్ళు నా వాళ్ళు' అనుకున్న నేను, నేను సంపాదించుకున్న డిగ్రీని, నా వ్యక్తిత్వాన్ని పూర్తిగా మరిచిపోయాను. గానుగకు కట్టిన ఎద్దులాగా ప్రొద్దుట లేచిన దగ్గర్నుంచీ, రాత్రి పడుకోబోయే వరకూ, ఎన్నో పనులు, ఇంటెడు చాకిరీ చేసినా, ఎవరో ఒకరి వంకలు, విసుర్లూ తప్పకుండా వుండేవి. అలసటతో మనసూ, శరీరమూ పుండైపోయిన నాలో ఏదో నైరాశ్యం ఆవరించేది ఒక్కొక్కసారి. నాకు ఒంట్లో బాగా లేకపోతే ఎవరూ పట్టించుకోనపుడూ, ఇంట్లోని సభ్యులు నన్ను చులకనగా మాట్లాడినప్పుడూ, నన్ను నేను కోల్పోయి బానిసగా బ్రతుకుతున్నానేమో అన్పించేది. కానీ వెంటనే ఏ చుట్టమో, పక్కమో "ఇంటి కోడలంటే వసుంధరేనమ్మా కాకపోతే, ఈ రోజుల్లో ఎవరూ ఇంటెడు చాకిరీ చేసేది" అని పొగడగానే, ఆంజనేయస్వామికి మల్లే ఒళ్ళు పొంగిపోయి ఇంకా పని ఎక్కువ చేసేదాన్ని. "నేనెంతో అదృష్టవంతురాలిని' అని పొంగిపోతూనే ఇద్దరు పిల్లలను కన్నాను. "అయ్యో! ఇద్దరూ ఆడపిల్లలేనమ్మా" అని అందరూ అంటూంటే నేనూ బాధపడేదాన్ని. అలాసాగే జీవితంలో ఒక్కసారి పెను కల్లోలం. శ్రీధర్ ఎవరో అమ్మాయితో తిరుగుతున్నట్టు తెలిసింది. పెద్దపులిలాగా అతనిమీద విరుచుకుపడ్డాను. అతను నన్ను కొట్టాడు. నేను పెద్దగా అతనితో పోట్లాడాను.

"ఆమె లేకుండా నేను ఉండలేను, తనని రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నాను" అన్నాడు.

"నీకేం నష్టం లేదుగా. ఎందుకట్లా అరుస్తావ్" అన్నాడు.

'నా పిల్లల భవిష్యత్తు, నా భవిష్యత్తు ఏమిట'ని అడిగాను.

అతని వాళ్ళంతా 'ఆడ దానికి సమాధానం చెప్పేదేంటిరా? బయటికి పోక' అన్నారు, అతను షర్టు వేసుకుని బయటికి వెళ్ళిపోయాడు. నా గుండె అవమానంతో బద్దలైంది. ఆవేశంతో అమ్మా వాళ్ళ ఊరు వెళ్ళాను. అక్కడే ఉండి పోతానన్నాను.

"నీ పెళ్ళికి అయిన అప్పులకి ఇంకా వడ్డీలు కడుతున్నాం. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు కాకుండా నువ్వు తొందరపడకూడదు. ఓపిక పట్టాలి.." అని అనునయంగా చెప్పి తీసుకువచ్చి మళ్ళీ అత్తవారింట్లో దించేశారు. 'తెలిసిపోయిందిలే' అన్న ధీమాతో అతను పూర్తిగా ఇంటికి రావడమే మానుకున్నాడు. నేను మరీ చులకనైపోయాను. అయినా నేనేమీ పట్టించుకోలేదు. 'నాకు మిగిలిన ఆశ్రయం ఇదే' అనుకుని పనిమనిషి కన్నా

హీనంగా నన్ను వాళ్ళు చూసినా లెక్క చేయలేదు. కానీ, ఎదుగుతున్న నా పిల్లల్ని నిరాదరణతో చూడడం మొదలుపెట్టారు. "ఇదిగో వాటిని ముట్టుకోకండి.. వీటిని తియ్యకండి.. అవి మీవి కావు. మీక్కావాలంటే




మీ అమ్మనడగండి" ఇటు వంటి మాటలనడం, విసుక్కోవడం ప్రారంభిం చారు. చేతిలో పైసా లేని స్థితి. అయినా సర్దుకుపోతున్న పిల్లలను చూసి నా కడుపు తరుక్కుపోయింది. వాళ్ళలో రోజురోజుకీ పెరుగుతున్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, "ఈ ఇల్లు మనది కాదు, ఏవి ముట్టుకుంటే ఎవరేమనుకుంటారో" నన్న భయంతో అనుక్షణం ముడుచుకుపోతూ బ్రతుకుతున్న వాళ్ళను చూసి నాకు తెగింపూ వచ్చేది. ప్రతిదానికీ నన్ను చులకన చేసి మాట్లాడటం, ఈవిడ ఇటు వంటి మాలోకం కాబట్టే వాడు అట్లా అయిపోయాడని పొడిచే వాళ్ళు. ఇంటికి వచ్చిన వాళ్ళంతా "మగవాళ్ళకు ఇద్దరు ముగ్గురు సంబం ధాలున్నా సర్దుకు పోవాలి," అని ధర్మాలు బోధించే వాళ్ళు. ఇదంతా నా పాపఫలితం అన్నట్లుగా, "పూజలు, వ్రతాలు చేసుకొమ్మని సలహాలిచ్చే వాళ్ళు. నా మీద నాకే అసహ్యం పుట్టి విషం మింగి చద్దామన్న నిర్ణయానికి వచ్చాను. కానీ, నా అంతరాత్మ నన్ను నిలదీసింది. "ఆడదానిగా పుట్టినందుకేగా నీకీ దౌర్భాగ్యం.. చేతనైతే నీ పిల్లల్ని ఆడ పిల్లలుగా పుట్టినందుకు గర్వ పడేట్లు చెయ్యి" అని ప్రేరేపించింది. అంతే, ఎక్కడ లేని ధైర్యం తెచ్చు కున్నాను. నాకున్న చదువుతో ఒక ప్రైవైట్ కంపెనీలో ఉద్యోగం సంపా దించుకున్నాను. ఒక గది అద్దెకు తీసుకున్నాను. పిల్లలను దగ్గరగా ఉన్న స్కూల్లో చేర్పించాను. నాకు వచ్చే జీతం పూర్తిగా సరిపోయేది కాదు. సెలవురోజుల్లో టైపు జాబ్ వర్కులు చేసేదాన్ని. పిల్లలకు వాళ్ళం తట వాళ్ళు బ్రతకటం నేర్పించాను. ఉండే గది ఇరుకైనదే అయినా విశాలమైన ప్రపంచంతో నా పిల్లలకు సంబంధాలు పెరిగేలా వాళ్ళను నా అభిరుచులకు అనుగుణంగా పెంచుకున్నాను. కొన్నేళ్ళకు ఆయన పోయారని తెలిసింది. చూడడానికి వెళ్ళాను. ఆయన డబ్బును ఎరగా చూపి నన్ను పరిధుల్లో బిగించడానికి ప్రయత్నిం చారు. నా జీవితం మీద వాళ్ళకేదో హక్కు ఉన్న ట్లుగా స్వతంత్రంగా నాకెన్నెన్నో సలహాలు చెప్పారు. అన్నీ విన్నాను. పిల్లల్ని తీసుకొని మామూలుగా తిరిగి వచ్చేశాను. మళ్ళీ రొటీన్ మొదలు... ఇదీ.. క్లుప్తంగా నా వివాహజీవితం..

ఈ వ్యవహారంలో నేను పొందిన దానికంటే పోగొట్టుకున్నదే ఎక్కువ. పాతికవేల రూపా యల కట్నం.. పదేళ్ళ మనశ్శాంతి.. జీవితంలో సుఖ సంతోషాలు.. వీటిని నేను పోగొట్టు కున్నాను.

"ఇద్దరు ఆడపిల్లలను తల్లీ, తండ్రీ నేనై పెంచవలసిన బాధ్యత, అవమానాలు, టెన్షన్లు, ఎప్పుడు తప్పు చేస్తుందా... రాళ్ళు విసురుదామా అని అనుక్షణం నన్ను అప్రమత్తంగా గమనించే లోకులు... ఇవన్నీ నేను పొందినవి.

"కనుక, ప్రస్తుత వివాహ వ్యవస్థ ఆడదానికి భద్రత ఇవ్వడంలో పూర్తిగా విఫలమవుతోంది. ఈ వ్యవస్థ మారాలి. ఎవరో ఒకరు ఎప్పుడో ఒకప్పుడు మార్పు తీసుకు రావాలి. అదే నేను చేయబోతున్నాను. రేపు.. నీ సహకారం నాకు పూర్తిగా ఉంటుందని నమ్ముతున్నాను."

లేచి బెడ్‌రూమ్‌లోకి నడిచి లైట్ ఆఫ్ చేసేసి పడుకుంది వసుంధర.

ఒక్కసారి ఆమె వెనక్కి తిరిగి చూసివుంటే చెంపల మీద నుండి ధారగా కారుతున్న కన్నీటితో తననే అభిమానంగా చూస్తున్న రేఖ కనిపించి ఉండేది.

* * *

డబ్బుకు ప్రాధాన్యత పెరిగిపోయిన ఈ కాలంలో వివాహ వ్యవస్థ పూర్తిగా భద్రత లేని వ్యవస్థగా మారింది. అందుకే ఈ నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చింది.." నిశ్చలంగా అంది వసుంధర.

అప్పటికే అందరూ నిశ్చేష్టులై ఆమె వంక చూస్తున్నారు. అయినా అదేమీ ఆమె పట్టించు కోవడం లేదు. తన తరహాలో చెప్పుకుపోతున్నది.

"ఈ వివాహ వ్యవస్థ మారాలంటే ముందర ఆడ పిల్లలను పెంచే పద్ధతిలో మార్పు రావాలి. వాళ్ళను కూడా మగ పిల్లలను పెంచినట్లు లౌక్యం తెలుసుకునే పద్ధతిలో ఎందుకు పెంచరు? పుట్టిన దగ్గరనుంచీ వాళ్ళను గుండెల మీద కుంపట్లలాగే ఎందుకు పెంచాలి? ప్రతిదానికీ పెళ్ళికి ముడిపెట్టి ఎందుకు మాట్లాడతారు?

"పెళ్ళికూతుర్లా తలొంచుకుంటావెందుకు?"

"ఇప్పట్నించే ఇట్లా ఖర్చు పెడితే పిల్ల పెళ్ళెలా చేస్తారూ? అలా అని ఖర్చు పెట్టకుండా వుంటే..

"అవున్లే.. ఆడపిల్లలు గలవాళ్ళు.. ఇప్పటినుంచే దాచాలిగా"

"ఇప్పుడిట్లా చేసినా చెల్లుతుంది. రేపు అత్తారింటి కెళ్ళాక ఇలా చేస్తే అందరూ మమ్మల్ని ఆడిపోసు

-కుంటారు తల్లీ"

అని నిష్ఠూరాలు వేస్తూ ఆడపిల్లకు ఉగ్గుపాలతోటే 'పెళ్ళి'ని గురించిన సమాచారాన్నంతా వంట బట్టిస్తారు. ఆ పిల్ల కూడా ఎదుగుతున్న కొద్దీ తన జీవితాన్ని గురించిన ఆలోచన మానేసి 'పెళ్ళి'ని గురించే ఎక్కువగా ఆలోచిస్తుంది. ఈ పద్ధతి మారాలి. పెళ్ళిని గురించి కాకుండా ఆడపిల్ల తన జీవితాన్ని తాను తీర్చి దిద్దుకునే విధానం గురించి ఆలోచించే అవకాశం ఆమెకివ్వాలి..."

"అదంతా సరేనండీ.. మీరేమో కట్నం అంటూ ఇవ్వకుండా అంతా ఆ పిల్లపేరిట బాంకులో పెడతా మంటున్నారు. అది సాంప్రదాయమే కాదు. ఇహ మేము పెళ్ళి ఖర్చులు ఎదురుపెట్టి పెళ్ళి చేయాలా? మగపిల్లాడిని కన్నందుకు అప్పులపాలై నలుగుర్లో నగుబాటు కావాలా?" నిలదీసింది వియ్యపురాలు.

"మిమ్మల్ని ఎవరు ఎదురు ఖర్చు పెట్టమన్నారు? సింపుల్‌గా రిజిస్టర్ మేరేజి చెయ్యండి. సెక్యూరిటీకి సెక్యూరిటీ ఉంటుంది. అయినా వసుంధర కూతురి పెళ్ళి రంగ రంగవైభవంగా చేసింది అనిపించుకోవాలన్న కోరిక నాకు లేదు. మీకు ఉంటే మీరు ఖర్చు పెట్టుకుని చేసుకోండి."

"హయ్యో రాత! చివరికి రెండు ముద్దలు పప్పన్నం కూడా నలుగురికీ పెట్టుకోకపోతే ఇంకేం పెళ్ళి, పెటాకులూ" మెటికలు విరిచింది వియ్యపురాలు.

"నా పెళ్ళిలో ఖర్చు పెట్టించి, మర్యాదలు చేయించుకుని తిని వెళ్ళిన వాళ్ళలో ఏ ఒక్కరూ కూడా నా జీవితాన్ని నా భర్త అన్యాయం చేసిన రోజున 'ఇదేమిట'ని వచ్చి నిలదీయలేదు. మరి ఇంకెందుకండీ మన కష్టసుఖాలకు నిలబడని వాళ్ళకోసం ఆర్భాటం?" నిదానంగా ప్రశ్నించింది.

"మీ పెళ్ళి విషయంలో అలా జరిగిందని లోకంలో అందరి పెళ్ళిళ్ళూ అలాగే అవుతాయంటావా? ఇదెక్కడి విడ్డూరం..."

ఆవిడ ధోరణికి అడ్డొచ్చింది వసుంధర.

"మీకిది విడ్డూరంగానే కనపడచ్చు.. కానీ వాస్తవం. అన్ని వ్యవహారాలలోనూ, అస్సలు భద్రతే లేని వ్యవహారం వివాహం.

"ఈ వివాహం వ్యవహారంలో పూర్తిగా నష్ట పోయేది ఎప్పుడూ ఆడదే. తల్లిదండ్రులు ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకుని, తీసుకువచ్చి పోసిన కట్నం లెక్కకే రాదు. ఎవ్వరూ ఆ వూసే ఎత్తరు. ఆమెను ఉట్టి పుణ్యా నికి పెట్టిపోషిస్తున్నట్లు మాట్లాడతారు. అత్తవారింట్లో ఎవరికి కోపం వచ్చినా, ఎవరికి ఏ గుబులొచ్చినాచివరికి బల య్యేది ఆ పిల్లే అవుతుంది. అత్తింట్లో పూర్తిగా ఒంటరి దైపోయే ఆడపిల్లకు డబ్బు కలిగించే ధైర్యం ఉండాలి. అందుకే నా బిడ్డకు కట్నం ఇవ్వను. ఆ డబ్బు మొత్తం బాంకులో వేస్తాను. నెల నెలా వడ్డీ ఆమె పోషణ ఖర్చు కింద ఆమె తీసుకుంటుంది. తను ఒకరికి భార మయ్యాననే బాధ నా బిడ్డకు ఉండకూడదు."

"అంత అవసరం ఏమొచ్చింది ఆంటీ.. రేఖకు జాబ్ రేపో మాపో వస్తుంది. అప్పుడు తన కాళ్ళ మీద నిలబడే శక్తి తనకీ వస్తుంది.."

## లోకజ్ఞానం - ప్రశ్నలు

1. 'ఏ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్' గ్రంథ రచయిత?
2. ఒరిస్సా రాష్ట్ర విస్తీర్ణం ఎంతో చెప్ప గలరా?
3. పాండిచ్చేరిలో ప్రధానంగా మాట్లాడే భాషలు ఏవి?
4. లక్షద్వీప రాజధాని నగరం పేరు?
5. శ్రీలంక అధ్యక్షులు ఎవరో చెప్పగలరా?
6. 1998లో ఆసియాడ్ గేమ్స్ ఎక్కడ జరుగనున్నాయి?
7. భారతదేశ చరిత్రలో 1857 సంవత్సరపు ప్రాముఖ్యత ఏమిటి?
8. 'ఇండియా గేట్' ఏ నగరంలో వుంది?
9. స్పెయిన్ దేశపు రాజధాని నగరం?
10. TRIPS అంటే ఏమిటి?

### లోకజ్ఞానం - జవాబులు

1. ఎర్నెస్ట్ హెమింగ్వే. 2. 155, 707 చ.కి.మీ
3. తమిళం, తెలుగు, మళయాళం, ఇంగ్లీష్, ఫ్రెంచ్. 4.కావరాట్టి
5. చంద్రికా కుమార తుంగ. 6. బాంకాక్
7. స్వాతంత్ర్యం కోసం ప్రప్రథమంగా సిపాయితిరుగుబాటు
8. న్యూఢిల్లీ. 9. మాడ్రిడ్
10. ట్రేడ్ రిలేటెడ్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్స్

"నేను చెబుతున్నది నా బిడ్డ సంగతి కాదు. ఈ దేశంలో వరకట్న దురాచారం రక్కసి కోరలో అత్తింటి ఆరళ్ళు అనుభవిస్తున్న వేలాది, లక్షలాది ఆడపిల్లల సమస్యకు పరిష్కారం. నేను నా బిడ్డకు ఇస్తున్నది నేను కష్టపడి సంపాదించిన డబ్బు. ఆ డబ్బులోని ప్రతిపైసా ఆమెకే ఉపయోగపడాలి. అంతేకానీ, పెళ్ళి పేరిట చేసే అనవసర దుబారా ఖర్చుకు కాదు. మనదేశంలో ఈ రోజు ఎంతమంది మధ్యతరగతి తల్లిదండ్రులు నగలూ, ఇళ్ళూ వాకిళ్ళూ తాకట్టు పెట్టి తెచ్చిన సొమ్మును మగపెళ్ళి వాళ్ళు సగం తాగి వదిలేసే కూల్ డ్రింక్‌లకూ, విస్తళ్ళలో సగం తిని వదిలేసి వెళ్ళిపోయే పదార్థాలకూ వెచ్చించవలసి వచ్చి ఎంత రంపపు కోత అనుభవిస్తున్నారో ఎంతమందికి తెలుసు?.. అలా నా డబ్బు వ్యర్థం కావడానికి వీల్లేదు.."

"సరే ఆంటీ.. అలాగే.. మరి మా అమ్మా వాళ్ళు నా మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ఎం.బి.ఏ చదివించారు. అప్పులు చేశారు. కట్నం సొమ్ముతో ఆ అప్పులు తీర్చుకుందామని అనుకోవడంలో తప్పుందంటారా?"

"నేనూ నా బిడ్డను చదివించాను. కానీ, దానిమీద నేనేమీ ఆశలు పెట్టుకోలేదే. నిన్ను చదివించింది నువ్వు ఉద్యోగం చేసి అభివృద్ధిలోకి వస్తావనే గానీ, నిన్ను కట్నాల మార్కెట్లో అమ్మి డబ్బు చేసుకుందామని కాదనుకుంటాను. ఇంకొక మాట.. కేవలం కట్నం తీసుకుని నిన్ను మీవాళ్ళు వదిలెయ్యరనుకుంటాను. నువ్వు సంపాదించి వాళ్ళకు సహాయం చేసి వాళ్ళను చివరిదాకా ఆదుకుంటావనే ఆశ వాళ్ళకు లేదంటావా?" సూటిగా అడిగింది వసుంధర.

"మా అబ్బాయిని చదివించింది కట్నాల ఆశతో కాదులెండి. మా పట్ల, వాడికున్న బాధ్యతలను వాడు నిర్వహించుకుంటాడనే. వాడేదో మాకు సాయపడాలని అలా మాట్లాడుతున్నాడు.." సర్దింది వియ్యపురాలు.

"ఆఁ.. అదే.. అందుకేగా మీ అబ్బాయిని చదివించారు. మీ కోసం మీ అబ్బాయిని మీరు చదివించుకొని ఆ ఖర్చును మమ్మల్ని కట్నం రూపంలో కట్టమనడం న్యాయమేనా?"

వసుంధర ప్రశ్నలోని తీక్షణతకు అక్కడున్న వాళ్ళంతా జంకారు.

"ప్రతి తల్లీ తండ్రి ఇలాగే చేస్తే ఆడపిల్లల జీవితాలు కష్టాలలోనుంచి బయటపడతాయి. ఆమె పోషణకు నెలనెలా ఆదాయం వస్తుంది. కట్నం డబ్బు కైంకర్యం చేసేసి దీని మొహాన ఇంత కిరసనాయిలు పోసి తగలేస్తే మళ్ళీ ఇంకో పిల్ల దగ్గర కట్నం గుంజొచ్చు అన్న దురాలోచన పోతుంది. విధి వక్రించి పరిస్థితులు తారుమారై భర్త చనిపోతే ఆ డబ్బు ఆధారం అవుతుంది. 'ఇది పూర్తిగా నిరాధారంగా నేను పెడితే తిని బతుకుతోంది. నేనేం చేసినా అడిగే దిక్కు లేదు'. అన్న పురుషాహంకారంతో భార్యల్ని హింసించే వాళ్ళ పొగరు కాస్త తగ్గుతుంది. వైవాహిక జీవనం దుర్భరమైననాడు ఆ అమ్మాయి తన కాళ్ళమీద తాను నిలబడేవరకూ ఆ సొమ్ము ఆదుకొంటుంది. మీరు సెంట్‌పర్సెంట్ కరెక్ట్ ఆంటీ.... మీ వాదన వెనక ఇంత ఆలోచన ఉంది.."

"థాంక్స్ బాబూ! అర్థం చేసుకున్నావు. అంతే చాలు" తృప్తిగా అంది వసుంధర.

"సరే.. ఇక వెళ్ళొస్తామండీ.. కట్నం తీసుకొని.. కోడల్ని పరాయిదాన్ని చేసుకోవడం నాకూ ఇష్టం లేదు.. మీ ఆశయాలు బాగున్నాయి.. కాలంతో పాటు మనమూ మారాలి లెండి.." లేస్తూ అన్నది వియ్యపురాలు.

వసుంధర కళ్ళు ఆనందంతో మెరిశాయి.